ఎమ్మెల్యేకు వీఆర్‌ఏల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

మైలార్‌దేవ్‌పల్లి: వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇప్పించాలని రాజేంద్రనగర్ వీఆర్‌ఏలు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.గత ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య నియామకాల కోసం జీవోఎంఎస్ 81,85 ప్రకారం 3797 మంది 61, సంవత్సరాల పై బడిన వారి వారసులకు ఉద్యోగ నియామకం కోసం జీవోలు జారీచేసినా జీవోలపై స్టే ఉన్న కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. 21 అక్టోబర్ 2023న హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వుల అనుసారం జీవో నెం 81పైన స్టే ఎత్తివేశారని 5–10 సంవత్సరాలుగా 61 సంవత్సరాలు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలను ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వీఆర్‌ఏల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటానన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



నిరసన తెలిసిన అంగన్‌వాడీ టీచర్లు

మణికొండ: కార్మికుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పింఛన్, ఉచిత బస్సు ప్రయాణంతో ఇబ్బందులు పడుతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ శాఖలలో ఎక్కువ మంది మహిళలు పని చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వారికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ రూ. 12వేలు కనీస వేతనంగా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో లత, సుధారాణి, శ్రీదేవి, సునీల్, అనిల్‌రాజు పాల్గొన్నారు.

8 వేల లీటర్ల మద్యం బాటిళ్లు ధ్వంసం



మొయినాబాద్ ఠాణా ఆవరణలో పట్టుబడిన మద్యం

మొయినాబాద్: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బెల్టు షాపులు, ఫాంహౌస్‌లలో పట్టుకున్న మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని 9 స్టేషన్లలో నమోదైన 333 కేసుల్లో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మొయినాబాద్ పీఎస్ ఆవరణలో 8,551 లీటర్ల మద్యం, బీరు బాటిళ్లను జేసీబీతో ధ్వంసం చేశారు. మొయినాబాద్ పీఎస్ పరిధిలో 3,028 లీటర్లు, నార్సింగి పరిధిలో 570 లీటర్లు, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో 765.38 లీటర్లు, శంకర్‌పల్లి 1,200.34 లీటర్లు, మోకిల 888.34 లీటర్లు, చేవెళ్ల 1,140 లీటర్ల మద్యం బాటిళ్లను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఆబ్కారీ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ప్రదీప్ సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేధిస్తున్నాడని ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు



కిషోర్ మక్వానాకు ఫిర్యాదు చేస్తున్న నరేందర్

శంషాబాద్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తనను వేధిస్తున్నాడని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ బుధవారం ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషనర్ చైర్మన్ కిషోర్ మక్వానాకు ఫిర్యాదు చేశారు. సాతంరాయిలోని సర్వే నంబరు 17లో తన తండ్రి జంగయ్య 12 ఎకరాల భూమిని సాగు చేశారన్నారు. దీనిపై చట్టబద్ధమైన ఆధారాలతో తాము అనుభవించిన భూమిలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తన హోదాతో అక్రమంగా ప్రవేశించేందుకు ఓ కాంట్రాక్టరు ద్వారా నిర్మాణం చేయించే ప్రయత్నం చేశారన్నారు. తనతో పాటు తన కుటుంబం తీవ్ర మానసిక వేదనకు గురవుతోందని ఈ విషయమై దర్యాప్తు చేపట్టి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్ట్‌గ్యాలరీలో స్వదేశీ వస్త్ర ప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ ఆడిటోరియంలో బుధవారం స్వదేశీ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఆకర్షణీయమైన రంగులతో, నాణ్యమైన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

పంచాయతీల్లో పడకేసిన పాలన!

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- బిల్లుల చెల్లింపులో జాప్యం
- సిబ్బందికి తప్పని ఇబ్బందులు



మండలంలోని బోటిగూడలో రోడ్లపై పారుతున్న మురుగు



బోటిగూడలో జామైన మ్యాన్‌హోల్

శంషాబాద్ రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.. ఓ వైపు వర్షాకాలం రావడంతో వీధుల్లో చెత్త, చెదారంతో అపరిశుభ్రంగా మారగా.. మరో వైపు మురుగునీరు ఇళ్ల పరిసరాల్లో చేరి దోమలు వ్యాప్తికి కారణమవుతోంది. ఇదే సమయంలో మురుగు కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. పంచాయతీ పాలకవర్గం పాలన ముగిసి ఆరు నెలలు దాటింది. అప్పటి నుంచి ఆయా పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా పైపులైన్ల మరమ్మతులు, ఇతర చిన్న చిన్న పనుల కోసం పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. వీటి బిల్లులను డ్రా చేసేందుకు పంచాయతీలకు ప్రత్యేక నిధులు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పంచాయతీల బ్యాంకు ఖాతాల నుంచి సిబ్బంది జీతాలను మాత్రమే డ్రా చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

పేరుకుపోయిన బిల్లులు..

పంచాయతీ కార్యదర్శులు పరిస్థితి అరకత్తెరలో పోక చెక్కలా మారింది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా కోసం వెచ్చించిన బిల్లుల మంజూరులో జాప్యంతో పంచాయతీ కార్యదర్శులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో ఆయా పనుల కోసం చాలా చోట్ల సిబ్బంది సొంత డబ్బులు వెచ్చించారు. ఇవి ఎప్పుడు చెల్లిస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు.

సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువ..

వానాకాలం సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గ్రామాల్లో చెత్త, చెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వీధులు, రోడ్లు, ఇళ్ల పరిసరాల్లో మురుగునీటితో పాటు వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి కార్యాచరణ ప్రారంభించాలి. అయితే ఆయా పనులు చేపట్టడానికి ప్రత్యేకంగా నిధులు లేకపోవడం భారంగా మారింది. ఇప్పటి వరకు ఖర్చు చేసిన బిల్లులు రాకపోవడం పంచాయతీ కార్యదర్శుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. జీతం డబ్బుల నుంచి పనులు చేయించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



శివాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన వైస్ చైర్మెన్, ఏఈలు

మణికొండ: విద్యుత్ సమస్యలను నివారించేందుకు అవసరమైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, హెచ్చు తగ్గ సరఫరాలను నివారించే పనులను చేపట్టాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరాలయం దేవాలయానికి కొత్తగా ఏర్పాటు చేసిన 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయంతో పాటు చుట్టూ పక్కల విద్యుత్ వాడకం పెరగటంతో లోటల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఉండేవన్నారు. వాటిని గుర్తించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన ఏఈకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌గౌడ్, కౌన్సిలర్ వసంతరావు, నాయకులు రామకృష్ణారెడ్డి, యాలాల నరేశ్, రాఘవరెడ్డి, బీరప్ప, శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, రవికాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పూజారి మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు



ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం



ధ్వజస్తంభం పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి గాంధీనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో బుధవారం ధ్వజస్తంభం ఏర్పాటు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభం ఏర్పాటు సందర్భంగా గత మూడు రోజులుగా దేవాలయ ఆవరణలో హోమాలు, యజ్ఞాలతో పాటు మంగళవారం ఎల్లమ్మ దేవీ కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొక్క రామ్‌రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, సామ ఇంద్రపాల్ రెడ్డి, ధర్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సదానందం, నర్సింహ రెడ్డి, కిట్టు, కిషన్, మోహన్ రెడ్డి, దయానంద్, పెంటారెడ్డి, రాజ్‌పాల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలోని పార్కు ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

పవర్ లిఫ్టర్‌కు ఘనస్వాగతం



ఎయిర్‌పోర్టులో తేజావత్ సుకన్యబాయి

శంషాబాద్: దక్షిణాఫ్రికాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం సాధించిన తేజావత్ సుకన్యబాయి బుధవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో క్రీడాకారులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 7 జరిగిన పోటీల్లో 76 కేజీల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించినట్లు ఆమె తెలిపారు.

'మనూ' పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి బుధవారం పీహెచ్‌డీని ప్రకటించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో షకీల్ అహ్మద్ ప్రొఫెసర్ కనీజ్‌జెహ్రా పర్యవేక్షణలో 'ఇ–గవర్నెన్స్ ఈజ్ టూల్ ఫర్ గుడ్ గవర్నెన్స్: ఏ స్టడీ ఆఫ్ ఖిద్మత్ సెంటర్స్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పూంచ్ ఆఫ్ జమ్మూకశ్మీర్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

నేడు ఐఎస్‌బీలో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారు. 'పవర్ విదిన్ ది లీడర్‌షిప్ లెగసీ ఆఫ్ నరేంద్రమోడీ' పేరిట రచయిత, పబ్లిక్ పాలసీ అడ్వకేట్, లీడర్‌షిప్ ట్రెనర్ బాలసుబ్రహ్మణ్యం రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ ఎం పిల్లుట్ల పాల్గొంటారు.

మౌలిక వసతులు కల్పించాలని జెడ్సీకి వినతి

రాయదుర్గం: జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని బుధవారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిసి డివిజన్‌లోని నల్లగండ్ల హుడాకాలనీ, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కేశవనగర్, గోపన్‌పల్లిలో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు, మంచినీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం నల్లగండ్ల హుడాకాలనీలో గల కమ్యూనిటీ హాల్ మరమ్మతులు చేయించాలని, ఖాజాగూడలోని సాయిఐశ్వర్య కాలనీలో ఉన్న పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, క్రీడాప్రాంగణం, ప్రహరీగోడ, కేశవనగర్‌లోని శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం నల్లగండ్ల హుడా కాలనీవాసులతో కలిసి జెడ్సీకి వినతిపత్రాన్ని అందించారు.

పాత స్టాంపు పేపర్‌తో రూ. కోట్ల భూమికి ఎసరు!

ఇద్దరి రిమాండ్



మహ్మద్ ముక్రముద్దీన్ ఖాన్



మీర్ అష్వాక్ అలీ ఖాన్

రాజేంద్రనగర్: నిజాం నవాబులు గిఫ్ట్ డీడీగా తమకు స్థలాలను ఇచ్చారంటూ ఓ నకిలీ స్టాంప్ పేపర్‌తో ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వం నుంచి రూ.5.78 కోట్ల టీడీఆర్‌ను తీసుకుని రూ. కోట్ల విలువైన స్థలాలు తమవే అంటూ అసలు యజమానులను బెదిరిస్తూ స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు యత్నించిన ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఉప్పర్‌పల్లి సర్వే నంబర్ 43, 44, 46లో సందీప్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు 3.08 ఏకరాల స్థలాలు ఉన్నాయి. అయితే.. పాత సర్వే నంబర్ 78లో పంట పొలాలను నిజాం నవాబు కుటుంబ సభ్యులు తమకు గిఫ్ట్‌గా ఇచ్చారంటూ బహదూర్‌పురా తాడ్‌బన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ముక్రముద్దీన్ ఖాన్ (44) పాత తేదీలో ఉన్న స్టాంపు పేపర్‌లో దస్తావేజులు రాసుకొని వచ్చాడు. 2022లో తమ స్థలం రోడ్డులో పోయిందంటూ ప్రభుత్వం నుంచి రూ.5.78 కోట్ల టీడీఆర్‌ను తీసుకున్నాడు. ఈ టీడీఆర్‌తో ఉప్పర్‌పల్లిలోని సర్వే నంబర్ 43,44,46లోని స్థలాలు తమవేనంటూ 14 నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి తమకు అనుకూలంగా ఉన్న వారి పేరిట రిజిస్ట్రార్‌తో పాటు రైటర్‌ను మచ్చిక చేసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ స్థలాల్లో ఎలాంటి ఇళ్లు లేకున్నా ఇంటి నంబర్లు, ఆస్తిపన్ను, విద్యుత్ మీటర్లు తదితర ప్రభుత్వ విభాగాలన్నింటి నుంచి అనుమతులను తీసుకున్నాడు. మహ్మద్ ముక్రముద్దీన్ ఖాన్ ఇచ్చిన డబ్బుతో అన్ని శాఖల్లో పని చేస్తున్న వారు ఎలాంటి పరిశీలన లేకుండానే దస్తావేజులను అందించారు.

ప్రభుత్వ అధికారుల సహకారంతోనే?

వీటన్నింటికి టొలిచౌలికి ప్రాంతానికి చెందిన అష్వాఖ్ అలీ ఖాన్ (40) ముక్రముద్దీన్‌కు డబ్బుల సహకారం అందిస్తూ ఈ వ్యవహారాన్ని నడిపించారు. ఉప్పర్‌పల్లిలోని స్థలాలు తమవేనంటూ స్థలాలను కై వసం చేసుకునేందుకు వచ్చారు. అసలు యజమానులైన సందీప్ రెడ్డి కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తమకు తాత, ముత్తాతల నాటి స్థలాల దస్తావేజులన్నింటిని సమర్పించారు. పోలీసులు ముక్రముద్దీన్ ఖాన్‌ను పిలిపించి అతని దస్తావేజులు పరిశీలించారు. కేవలం ఒకే ఒక్క పాత తేదీలో ఉన్న స్టాంపు పేపర్‌తో ఇద్దరూ నిందితులు ప్రభుత్వం నుంచి టీడీఆర్ తీసుకొని ఈ వ్యవహారానికి పాల్పడ్డారు. ప్రభుత్వం సైతం టీడీఆర్‌ను ఎలాంటి పరిశీలన లేకుండానే రూ.5.78 కోట్ల నగదును చెల్లించింది. ఇందులో కొంత టీడీఆర్‌ను ఓ బిల్డర్‌కు నిందితులు విక్రయించారు. నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రెండు కారు, 14 దస్తావేజులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరెవరూ సహకరించారు.. వీరి వెనుక ఎవరున్నారన్న దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తాం



నిత్యావసరాలను అందిస్తున్న పాలక కమిటీ సభ్యులు, అధికారులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆమె అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో విద్యుత్ దీపాలు, నీటి సరఫరా సమస్యలు, పాడైన రోడ్లకు మరమ్మతులను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించటం, సమస్యలను పరిష్కరించటమే ధ్యేయంగా ప్రతి వార్డులో పర్యటిస్తున్నామన్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించటం, మరికొన్ని కౌన్సిల్ సమావేశంలో పెట్టి తీర్మానాలు చేసి పనులు చేపట్టేందుకే సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సరిపడ తాగునీరు రాకపోవటం ప్రజలకు తీవ్ర సమస్యగా మారిందని, అదే విషయంతో ఐదవ వార్డులో జరిగిన గొడవను కౌన్సిలర్‌లు అధికారుల దృష్టికి తెచ్చారు. అంతకు ముందు రోజు పైనుంచి నీటి సరఫరా నిలిచిపోవటంతోనే సమస్య వచ్చిందని, మిగతా రోజులలో అన్ని వార్డులలో సరఫరా సక్రమంగా జరుగుతుందని జలమండలి అధికారులు తెలిపారు.

రూ.4.29 కోట్ల పనులకు తీర్మానాలు..

మున్సిపాలిటీ పరిధిలో రూ.60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.20 లక్షలతో వైకుంఠధామాల అభివృద్ధి, రూ. 1.18 కోట్లతో ప్రహరీల నిర్మాణం, రూ.15 లక్షలతో వనమహోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానాలు చేశారు. రాబోయే బోనాల పండగకు దేవాలయాల వద్ద రూ.10 లక్షలతో దేవాలయాల అలంకరణ, కూడలిల అభివృద్ధికి రూ. 25 లక్షలు, విద్యుత్ సమస్యల పరిష్కారం, వీధీ దీపాలకు రూ. 50 లక్షలు, కమ్యూనిటీహాల్ నిర్మాణాలకు రూ. 30 లక్షలు, ఇతర పనులకు రూ.1.01 కోటి ఖర్చుచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, జలమండలి జీఎం మహేందర్‌నాయక్, డీజీఎం శ్రీమన్నారాయణ, విద్యుత్ ఏఈ సందీప్‌రెడ్డి, జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు నిత్యావసరాలు సబ్బులు, దుస్తువులు నూనెలను అందించారు.

హిమాయత్‌సాగర్ నీటిని బండ్లగూడ కార్పొరేషన్‌కు వచ్చేలా కృషిచేస్తా



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు హిమాయత్‌సాగర్ నీటిని సరఫరా అయ్యేలా కృషి చేస్తానని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. బుధవారం హెచ్ఎండబ్ల్యుయూఎస్ అధికారులతో కలిసి హిమాయత్‌సాగర్ చెరువును ఆమె సందర్శించారు. వాటర్ ప్రెషర్ ఫిల్టర్స్ గ్రిడ్ ఏర్పాటు చేసి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు నీటి సరఫరా చేసే విషయంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మేయర్ లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫిల్టర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసి హిమాయత్‌సాగర్ నుంచి నీటిని సరఫరా చేస్తే ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. సరైన నీటి సరఫరా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మణికొండ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ గ్రిడ్‌ని కూడా సందర్శించామన్నారు. అధికారులతో చర్చించి సాధ్యమైనంత తొందరలోనే బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో హిమాయత్‌సాగర్ నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నార్సింగిలో సీసీ రోడ్డు పనలను ప్రారంభించిన చైర్‌పర్సన్ నాగపూర్ణ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ.50 లక్షల మున్సిపల్ నిధులతో చేపడుతున్న పనులను ఆమె కౌన్సిలర్ లక్ష్మీప్రవల్లికతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లను ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో వేసిన సీసీ రోడ్లు చాలా వరకు తవ్వకాలతో ధ్వంసమయ్యాయని అలాంటి వాటి స్థానంలో నూతన రోడ్లు వేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని అందుకు అనుగుణంగా గత రెండు మున్సిపల్ సమావేశాల్లో అలాంటి పనులకు నిధులను కేటాయించామని, రాబోయే రోజుల్లో అన్ని వార్డులలో పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఈ నరసింహారాజు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, నాయకులు వేణుగౌడ్, మహేందర్‌గౌడ్, అఖీల్, కల్యాణ్ పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

ఇద్దరి రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

రాజేంద్రనగర్: మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరికి జైలుశిక్ష పడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన సూర్యరాజు (26) హైదర్‌గూడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆ సమయంలో బస్సులోని విద్యార్థులతో కలుపుగోలుగా ఉండేవాడు. డ్రైవర్ సూర్యరాజు ప్రవర్తన నచ్చక యజమాన్యం అతడిని తొలగించి హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన ఆర్.శ్రీరాములు (25)ను డ్రైవర్‌గా తీసుకున్నారు. కాగా.. సూర్యరాజు మైనర్ బాలిక (14)తో స్కూల్‌కు బస్సులో వచ్చే సమయంలో మాట్లాడుతూ చనువుగా ఉండేవాడు. 2016లో ఉదయం సమయంలో డ్రైవర్ శ్రీరాములుకు ఫోన్ చేసిన సూర్యరాజు బాలికతో సెల్ ఫోన్‌లో మాట్లాడించాలంటూ సూచించాడు. శ్రీరాములు ఆరాంఘర్ వద్ద బస్సు రాగానే సూర్యరాజుకు ఫోన్‌చేసి బాలికతో మాట్లాడించాడు. అప్పటికే సూర్యరాజు అదే ప్రాంతంలో ఉండి బాలికను కారులో బయటికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని తెలపడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇద్దరిని జైలుకు తరలించారు. ఈ కేసులో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.50 వేల నష్ట పరిహారం అందించాలని తీర్పునిచ్చారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం

మాదాపూర్‌లో రహదారులను పరిశీలించిన అధికారులు

మాదాపూర్: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రోడ్ల విస్తరణలో భాగంగా బుధవారం సైబరాబాద్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్యలతో కలసి పలు ప్రాంతాల్లోని రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్ల పక్కన వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో బయోడైవర్సిటీ కొత్తగూడ కూడళ్ళు, రాడిసన్ హోటల్, రోలింగ్ హిల్స్, మసీద్‌బండ, కొండాపూర్, హైటెక్‌సిటీ ప్రాంతాలలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. రహదారుల పక్కన ఇసుక పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సర్కిల్‌లో డీసీ స్థాయి నుంచి కిందిస్థాయి వరకు పర్యవేక్షణ అధికారులు రోజువారీ పారిశుద్ధ్య పనులను పరిశీలించాలన్నారు. కొత్తగూడ కూడళ్లలో ఏఎంబి మాల్‌వద్ద రహదారులపై ఎత్తుపల్లాలను సరిచేయాలని చెప్పారు. అనంతరం ఎన్‌కన్వెన్షన్ బైలైన్ నుంచి యశోద హాస్పిటల్ మీదుగా బుట్టా కన్వెన్షన్ వరకు రోడ్డు విస్తరించినట్లైతే ట్రాఫిక్ సమస్యలను అధిగమించవచ్చని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు.